నమస్తే తెలంగాణ

# నాగర్‌కర్నూల్

5 | మహబూబ్‌నగర్, సోమవారం 19 ఫిబ్రవరి 2024 | NAGARKURNOOL



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

## సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- పశుబల ప్రదర్శన, బాస్కెట్‌బాల్ విజేతలకు బహుమతుల ప్రదానం

అయిజ, ఫిబ్రవరి 18 : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మండలంలోని ఉత్తనూర్ ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నాలుగు రోజులుగా నిర్వహించిన అంతర్రాష్ట్ర పశుబల ప్రదర్శన, బాస్కెట్‌బాల్ టోర్నీ ఆదివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విజయుడు హాజరై విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పశుబల ప్రదర్శన పోటీల నిర్వహణలో ఉత్తనూర్‌కు ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు. కీ.శే. పులకుర్తి తిరుమల్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చేందుకు ఆయన తనయుడు గౌతంరెడ్డి, రామచంద్రారెడ్డి కృషి చేయడం అభినందనీయమన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే ధన్వంతరి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, దేవస్థాన కమిటీ సభ్యులు, క్రీడాకారులు, రైతులు పాల్గొన్నారు.



నవాబ్‌పేట మార్కెట్ యార్డుకు భారీగా వచ్చిన వేరుశనగ

## వేరుశనగ @ రూ.7,189

నవాబ్‌పేట, ఫిబ్రవరి 18 : నవాబ్‌పేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం వేరుశనగ క్వింటాకు రూ.7,189 ధర లభించింది. ఆదివారం మార్కెట్ యార్డుకు రైతులు వేరుశనగను విక్రయించేందుకు భారీగా తీసుకొచ్చారు. వివిధ గ్రామాల నుంచి 8,700 బస్తాల వేరుశనగ మార్కెట్‌కు వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి రమేశ్ తెలిపారు. కాగా గత వారం కంటే ఈ వారం క్వింటాకు అధికంగా రూ.200 ధర లభించినట్లు తెలిపారు. క్వింటాకు గరిష్ఠంగా రూ.7,189 లభించినట్లు చెప్పారు. మార్కెట్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టెండర్లు వేసినట్లు కార్యదర్శి వివరించారు.



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ప్రధాన ఆలయ ముఖద్వారం

### ఏర్పాట్లు పూర్తి..

మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం కావడంతో అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని రకరకాల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా క్యూలు, వసతి సదుపాయం కల్పించారు. కోనేరును శుభ్రం చేసి శుద్ధజలంతో నింపి పైప్‌లైన్ షవర్లను ఏర్పాటు చేశారు. దాసంగం, విశ్రాంతి షెడ్లను సిద్ధం చేసి జాతర ప్రాంగణంలో సీసీ కెమెరాలను బిగించారు. భక్తులకు అత్యవసర చికిత్స విభాగాన్ని ఏర్పాటు చేశారు. అదే విధంగా బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజూ అన్నదాన సత్రంలో అన్నదానం చేయనున్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

### ఉత్సవాల వివరాలు..

సోమవారం తిరుచ్చిసేవ, మంగళవారం (20వ తేదీన) హంసవాహన సేవ, బుధవారం (21న) గజవాహనసేవ, గురువారం (22న) సూర్యప్రభవాహనసేవ, శుక్రవారం (23న) హనుమత్‌వాహన సేవ, ప్రభోత్సవం, శనివారం (24న) గరుడవాహనసేవ, రథోత్సవం, ఆదివారం (25న) అశ్వవాహన సేవ, ద్వితీయ ప్రభోత్సవం, సోమవారం (26న) స్వామివారికి దర్బారు సేవ, మార్చి 2వ తేదీన శేషవాహనసేవ, 8వ తేదీ శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మధుసూదన్‌కుమార్ తెలిపారు.

# ఓం నమో వేంకటేశాయ..



ముస్తాబవుతున్న శ్రీవారి రథం

- నేటి నుంచి మన్యంకొండ బ్రహ్మోత్సవాలు
- నిఘా నీడలో జాతర ప్రాంగణం
- 23న ప్రభోత్సవం, 24న రథోత్సవం
- మార్చి 8న వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- దేవస్థాన తాత్కాలిక ఉత్సవ కమిటీ నియామకం

పాలమూరు, ఫిబ్రవరి 18 : మహబూబ్‌నగర్ రూరల్ మండలం మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పేదల తిరుపతిగా కొలిచే మన్యంకొండ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండగా 24న రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్‌కుమార్ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

***ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు..***

భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నారు. అమ్మవారి ఆలయం నుంచి కొండ పైకి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.47లక్షలు, నీటి వసతికి రూ.64 లక్షలు కేటాయించి పనులు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో దుకాణ సముదాయాలు, ముఖద్వారం, రెండో ఘాట్‌రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. డబుల్ రోడ్డుతోపాటు కల్యాణ మండపం నిర్మించేందుకు నిధులు కేటాయించారు. కాగా, దేవస్థాన తాత్కాలిక ఉత్సవ కమిటీని శనివారం దేవాదాయ శాఖ నియమించింది. గతంలో ఉన్న పాలకమండలి కమిటీ పదవీ కాలం పూర్తి కావడంతో తాత్కాలిక కమిటీ సభ్యులుగా గోవిందు, ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వీరన్న, సురేందర్‌ను నియమించారు.

## బండ్ల ఊరేగింపు

మూసాపేట (అడ్డాకుల), ఫిబ్రవరి 18 : మండలంలోని రాచాలలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఎడ్లబండ్లు, కార్లు, ట్రాక్టర్లు, ఆటోలు, బైక్‌లతోపాటు ఇతర వాహనాలను రంగులతో ముస్తాబు చేసి గ్రామంలో ఊరేగించారు. అనంతరం స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ప్రధానఘట్టమైన బండలాగుడు పోటీలను సోమవారం సాయంత్రం నిర్వహించనుండగా, భక్తులు అధికసంఖ్యలో తరలిరానున్నారు.



ఆలయం చుట్టూ బండ్లు తిప్పుతున్న భక్తులు

## మూసాపేటలో పిల్లల దొంగలు!

- ఆటోలో తిరుగుతున్న నలుగురు దుండగులు
- చిన్నారులే లక్ష్యంగా బియ్యం సాకుతో రెక్కీ!
- మైకులో చాటింపుతో అప్రమత్తమైన గ్రామస్తులు

మూసాపేట, ఫిబ్రవరి 18 : పిల్లల దొంగలు వచ్చారన్న వార్త మూసాపేటలో కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే.. మూసాపేటలోని కుమ్మరిగేరిలో రెండ్రోజులుగా బియ్యం అమ్ముతారా అంటూ నలుగురు వ్యక్తులు తిరుగుతున్నారు. ఈక్రమంలో ఆదివారం కుమ్మరిగేరిలోని జ్యోతి, నాగేశ్ కూలి పనులకు వెళ్లగా వారి ఎనిమిదేండ్ల కుమారుడు గుణశేఖర్ ఇంటి వద్దే ఉన్నాడు. మధ్యాహ్నం వేళ ఇంటి వద్దకు వచ్చిన దుండగులు ఆ పిల్లవాడిని బియ్యం ఉన్నాయా? అని అడుగగా లేవని చెప్పాడు. కాగా వారు అంగి గల్లా గట్టిగా పట్టుకొని సందులోకి ఈడ్చుకెళ్తుండగా గుణశేఖర్ కేకలు పెడుతూ ఏడ్చాడు. దీంతో చుట్టుపక్కల పిల్లలు రావడంతో దుండగులు బాలుడిని వదిలిపెట్టి పారిపోయారు. విషయం కాస్త ఊళ్లో తెలియడంతో గ్రామస్తులు వెంటనే ఆటోలో నలుగురు వ్యక్తులు పిల్లలను ఎత్తుకెళ్లేందుకు వచ్చారని మైకులో చాటింపు వేయించారు. ఎంత వెతికినా వారు కనిపించకపోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు వెంటనే ఎస్సై సుజాతకు సమాచారమివ్వగా సిబ్బందిని పంపి ఘటనపై ఆరా తీశారు. ఈ విషయంపై పోలీసులు నిజం తేల్చాల్సి ఉన్నది.

## కలలను నిజం చేసుకోవాలి

మనిషి.. తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచే ఏదో నేర్చుకోవాలనే సంకల్పం మొదలవుతుందని ప్రతిభ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ అన్నారు. ఈ క్రమంలోనే ఎక్కువగా ఆలోచించకుండా ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని గర్భిణులకు పెద్దలు చెబుతుంటారన్నారు. డాక్టర్లు సైతం ఇలాగే సూచిస్తారన్నారు. గర్భం నుంచి బిడ్డ ఆరోగ్యంగా జన్మించి సమాజానికి ఎంతో మేలు చేస్తూ ఉన్నతస్థాయికి చేరుకోవాలని, అక్కడి నుంచే మనిషి జీవితం ఆరంభమవుతుందని తెలిపారు. ప్రతిభ కళాశాల విద్యార్థులు సైతం ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని తెలియజేశారు. నేర్చుకునే పనిలో స్పష్టత ఉండాలని, అప్పుడే మనం అనుకున్న స్థాయికి చేరుకుంటామన్నారు. యువత ఎంత బలంగా ఉంటే దేశం అంత బలంగా ఉంటుందని గుర్తు చేశారు. ప్రతి బిడ్డ ఆరోగ్యంగా ఉంటూ తమ తల్లిదండ్రుల కలలను నిజం చేయాలన్నారు. 83 మందికి తమ కళాశాల శిక్షణ ఇవ్వగా 55 మంది నీట్‌లో ర్యాంకులు సాధించారన్నారు. కళాశాలలో 2,500 మంది విద్యార్థులు ఉండగా ఎంతోమంది మంచిస్థానాలను చేరుకున్నారని తెలిపారు. సర్టిఫికెట్ల కోసం కళాశాలకు వచ్చి ''మాకు ఉద్యోగం వచ్చింది.. మీ ఆశీర్వాదం కావాలి సార్'' అని చెబుతుంటే చెప్పలేనంత సంతోషం కలిగిందని, ఈ జీవితానికి ఇంతకన్నా ఏం కావాలన్నారు. ప్రతి క్షణం ధర్మంవైపు నిలబడి ముందుకు సాగితే ఉన్నతస్థాయికి చేరుకుంటారని తెలిపారు. విద్యార్థి నిర్లక్ష్యాన్ని వీడి అలుపెరగని బాటసారిలా శ్రమిస్తే ఉన్నత శిఖరాలను చేరుకుంటాడని తెలిపారు. చేసే పనిలో స్పష్టత, ఉన్నత స్థాయికి చేరుకోవాలనే తపనతో ముందుకు సాగితే విజయం మీవెంటే నడుస్తుందని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో ఇలాంటి శిక్షణ తరగతులను విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతిభ కళాశాల విద్యార్థులు కేఎల్ యూనివర్సిటీలోనూ చదువుతున్నారని చెప్పడం తనకు చాలా సంతోషాన్ని కలిగిస్తుందన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రొఫెసర్, నమస్తే తెలంగాణ సిబ్బంది



అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు

- చేతికి వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- డ్యుయల్ కోర్సుల్లో ప్రావీణ్యం సాధించడం గొప్ప విషయం
- కేఎల్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ షణ్ముఖకుమార్
- 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే', 'కేఎల్ యూనివర్సిటీ' ఆధ్వర్యంలో 'లక్ష్యం-2024'
- సదస్సుకు హాజరైన ప్రతిభ కళాశాల విద్యార్థులు

# ఉన్నతంగా ఎదగడమే లక్ష్యం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 18 : అందరి జీవితాల్లో ప్రతి రోజూ బ్రహ్మాండమైనదేనని కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జేవీ షణ్ముఖకుమార్ అన్నారు. ఆదివారం 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే', 'కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ' ఆధ్వర్యంలో 'ఇంటర్మీడియెట్ తరువాత ఉన్నత విద్యా అవకాశాలు' అనే అంశంపై 'లక్ష్యం-2024' పేరిట జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎం ఫంక్షన్‌హాల్‌లో ప్రతిభ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షణ్ముఖకుమార్ మాట్లాడుతూ అవకాశాలు అందరికీ అందుబాటులో ఉన్నా కొందరు మాత్రమే అందిపుచ్చుకొని అనుకున్న లక్ష్యం వైపు ప్రయాణిస్తారని తెలిపారు. ప్రతి దానికి లిమిట్ ఉన్నా మనిషి ఆదాయానికి మాత్రం లిమిట్ లేదన్నారు. చెరువులో చేప, కుందేళ్లకు పరుగు, సింహానికి వేటాడడం ఇలా ఏ జీవి అయినా.. తనకు తాను నేర్చుకుంటుందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో యూట్యూబ్, గూగుల్ వంటి ప్రసార మాధ్యమాల ద్వారా మనిషి పరిజ్ఞానాన్ని పెంచుకునే వెసులుబాటు ఉందన్నారు. గురువుతో పనిలేదనే స్థాయికి విద్యార్థుల తల్లిదండ్రులు సైతం వచ్చేశారని తెలిపారు. ఈ కాలంలో నాకు ఒకే పని వస్తది.. మిగతా విషయాల్లో పరిజ్ఞానం లేదంటే కుదరదని, అన్ని పనుల్లో ప్రావీణ్యం ఉంటేనే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఈ సందర్భంగా ఒక కథను ఉదహరిస్తూ 'ఒక ఆవు, సింహం, మనిషి.. ముగ్గురు అన్ని వస్తువులు, తినుబండారాలు లభించే షాపింగ్ మాల్‌కు వెళ్లారు. ముందుగా ఆవు షాపింగ్‌కు వెళ్లి తనకు అవసరమైన ఆకుకూరలు, గడ్డి తిని వెనక్కి వస్తుంది. సింహం వెళ్లి మాంసాన్ని తిని తిరిగొస్తుంది. మనిషి వంతు వచ్చే సరికి మాల్‌లోకి వెళ్లి బయటికి రాకుండా అక్కడే తిరుగుతుంటాడు. ఎంతకీ బయటకు రాకపోవడంతో గురువు మాల్ లోపలికి వెళ్లి అతడిని ఎందుకు బ యటకు రావడం లేదని ప్రశ్నిస్తాడు. అప్పుడు ఆ మనిషి నాకు అవసరమైనవన్నీ ఇక్కడ ఉన్నాయి కానీ.. ఏది ఇప్పుడు తీసుకోవాలో తెలియడం లేదని సమాధానమిస్తాడు. దీంతో మనిషికి గురువు అవసరం తప్పనిసరి అని.. ఎప్పుడు ఏది ఎంత అవసరమో తెలియజేస్తేనే మనిషి అటువైపు ప్రయాణించి ఉన్నతస్థాయికి చేరుకుంటాడని చెబుతాడు.' మనిషికి కచ్చితంగా గురువు అవసరమవుతాడని, ఆ గురువే కేఎల్ యూనివర్సిటీ అని తెలియజేశారు. ప్రపంచంలో అన్ని దేశాల కంటే మన దేశంలోనే యువత అత్యధికంగా ఉన్నారన్నారు. మనిషి వయస్సును పరిగణలోకి తీసుకుంటే సరాసరి 28.17 వయస్సు గల వారు అత్యధికంగా ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయని తెలిపారు. యూఎస్ 51, చైనా 53, జపాన్ 48, ఇలా ఆయా దేశాల సగటు వయస్సు శాతం ఇలా ఉండడంతో మన దేశం ము న్ముందు మరింత ఉన్నతస్థాయికి చేరుకునేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. మన దేశంలో విద్యలో మూడోశాతం ఉందని, మొదటిస్థానంలో ఉండేందుకు కృషి చేస్తున్నామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కేఎల్ యూనివర్సిటీ మొదటిస్థానంలో నిలిచిందన్నారు. ఒక నిర్ణీత సమయంలో డ్యూయల్ కోర్సులు చదివి వాటిలో ప్రావీణ్యం సంపాదించడం గొప్ప విషయమన్నారు. మున్ముందు కరెంట్ కూడా వైర్‌లెస్‌గా రావడం ఖాయమని, ఆ దిశగా టెక్నాలజీ పరుగులు పెడుతుందని తెలిపారు. ఎన్ని అవమానాలు ఎదురైనా, ఇబ్బందులు తలెత్తినా అనుకున్న లక్ష్యం వైపు అడుగులు వేస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కేఎల్ యూనివర్సిటీ మీ లక్ష్యాలను నెరవేర్చడంలో తోడ్పడుతుందన్నారు. 'కేఎల్'లో చదివిన విద్యార్థులు ప్రపంచ మంతటా వివిధ దేశాల్లో ఉన్నత హోదాల్లో ఉన్నారని వివరించారు. ఇంజినీరింగ్‌కు మున్ముందు ఎంతో భవిష్యత్తు ఉందన్నారు. విద్యార్థులకు కేఎల్ యూనివర్సిటీ విద్యాబోధనతోపాటు 360 డిగ్రీల్లో కెరియర్ గైడెన్స్‌ను అందిస్తుందని తెలిపారు. 1983లో ఆరంభమైన కేఎల్ యూనివర్సిటీ 40 ఏండ్లుగా వేలాదిమంది విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించిన ఘనతను దక్కించుకుందన్నారు. ఎల్లప్పుడూ విద్యార్థులకు అందుబాటులో ఉంటూ వారి జీవితానికి భరోసా కల్పిస్తుందన్నారు. నచ్చినట్లుగా జీవిస్తూ అంతిమ లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అనంతరం ఇంటర్ ఫస్టియర్‌లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేయగా పలువురు విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నమస్తే తెలంగాణ బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్, అడ్వర్‌టైజ్‌మెంట్ మేనేజర్ విజయ్‌కుమార్‌రెడ్డి, యాంకర్ ఆదిత్య, నమస్తే తెలంగాణ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షణ్ముఖకుమార్

### 'కేఎల్'తో మీ జీవితానికి భరోసా

తమ విశ్వవిద్యాలయంలో చదివే వారి జీవితానికి భరోసా కలుగుతుందని కేఎల్ యూనివర్సిటీ మేనేజర్ వెంకటేశ్ అన్నారు. ఈ యూనివర్సిటీలో డిగ్రీ (బీ.టెక్) చదివే విద్యార్థులకు ఒకేసారి రెండు కోర్సులు పూర్తి చేసే అవకాశం ఉంటుందన్నారు. బీటెక్ చదువుతున్న కాల వ్యవధిలోనే వారి స్కిల్స్‌ను పరిగణలోకి తీసుకుంటూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చదివి ఉన్నత ఉద్యోగాలను పొందేందుకు కేఎల్ యూనివర్సిటీ అవకాశం కల్పిస్తుందన్నారు. తమ విశ్వవిద్యాలయం మెరిట్ స్టూడెంట్స్‌కు రూ.100 కోట్ల స్కాలర్‌షిప్‌లను అందిస్తుందని చెప్పారు. రూ.60 లక్షల వార్షిక ప్యాకేజీతో కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయని వివరించారు. దేశ విదేశాల్లోనూ 70 నుంచి 80 యూనివర్సిటీలతో 'కేఎల్'కు అనుబంధం ఉందని.. వారితో సంప్రదింపులు జరిపి ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంచే బాధ్యత తీసుకుంటామన్నారు. న్యాక్ అందించే నాలుగు మార్కుల్లో కేఎల్ యూనివర్సిటీ 3.86 మార్కులు సాధించిందన్నారు. మైక్రోసాఫ్ట్, విప్రోతోపాటు పలు పెద్ద కంపెనీలతో సంప్రదింపులు జరిపి సంబంధిత అధికారుల సమక్షంలో ప్రత్యేక సిలబస్‌తో కూడిన పుస్తకాలను తయారు చేస్తారన్నారు. ఒక్కో విద్యార్థికి రెండు, మూడు ప్లేస్‌మెంట్‌లు రావాలని ఆకాంక్షించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా కేఎల్ యూనివర్సిటీ ఫోన్ నెంబర్ 9133926000 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



మాట్లాడుతున్న వెంకటేశ్

### 'కేఎల్'లో చోటు దక్కించుకోవాలనుంది..



ఇంటర్ తర్వాత ఎలాంటి కోర్సు తీసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. బాగా చదివితే భవిష్యత్తులో ఎలాంటి ప్యాకేజీలు వస్తాయనే విషయాలను వివరించారు. కేఎల్ యూనివర్సిటీలో చోటు దక్కించుకొని చదవాలని ఉన్నది. ఈ సదస్సు మాకు చాలా ఉపయోగకరంగా ఉంది.

*- భీమేశ్, ఇంటర్ విద్యార్థి*



### భవిష్యత్తుపై మంచి అవగాహన వచ్చింది..

కేఎల్ యూనివర్సిటీ నిర్వహించిన సదస్సులో ఇంజినీరింగ్ విద్య గురించి చక్కగా వివరించారు. భవిష్యత్తులో ఏవిధంగా ముందుకెళ్లాలనే అంశంపై అవగాహన వచ్చింది. అత్యధిక ప్యాకేజీ ఇచ్చే కంపెనీల్లో స్థానాన్ని దక్కించుకోవడానికి ఈ సదస్సులు ఉపయోగపడతాయి. విద్య నేర్చుకునే అంశాలను క్షుణ్ణంగా వివరించారు. మాకు నచ్చిన కోర్సును ఎంచుకునే విషయంలో చాలా ప్రోత్సాహం, అవగాహన కలిగింది. ఇలాంటి అవగాహన సదస్సులు మాకు చాలా అవసరం.

*- రాజేశ్, ఇంటర్ విద్యార్థి*